# త్రిద్వనం

మంథా వెంకటరమణారావు



ఎడం చెయ్యెత్తి, కోటు చెయ్యి వెనక్కిలాగి రోలెక్స్ క్రోనోమీటర్ గడియారం కేసి చూసి, ''అందుతామా ?'' అన్న ప్రశ్నని ఆత్రంగా వేసేడు డాక్టర్ రావ్. అందకపోతే అవతల పుట్టి మునిగి పోయే కార్యక్రమం అస్తవ్యస్తమయేటట్టూ, అంతరిక్షంలోకి వదలబడబోయే రాకెట్ తను సమయాని కుండకపోవడంవల్ల ఆగిపోబోతున్నట్టూ ఉందతడి హడావిడి.

''అందుతాం సార్ !'' అన్నాడు, టియాటో సిట్రాన్‌ని, కృష్ణుడు కురుక్షేత్రంలో రథాన్ని పరుగెత్తించినట్టు, కురుక్షేత్రం వంటి నగర వీధుల్లోంచి పరుగెత్తిస్తూ షోఫర్‌ధన్ —డ్రయివర్ అని పిలవడం హోదాకి తక్కువని తెల్లటి యూనిఫారమూ, టోపీ తగిలించి షోఫర్‌గానూ, దుర్యోధన్ అన్నపేరుని ధన్‌గానూ మార్చేక దుర్యోధనుడి స్థితి బాగుపడినా మానినా శ్రీమతి ఎండ్ డాక్టర్ రావ్‌ల పరపతి మాత్రం పెరిగింది ! ''వాళ్ళ షోఫర్‌డ్రివెన్ కారులోనే తిరుగుతారు !'' అన్న ఆమోద ముద్ర వేయించుకోగలిగారు సొసైటీ ఉన్నత స్థానాల్లో !

''చంద్రమండలాన్ని గంటలో చేరుకోగలమా?'' అని డాక్టర్ రావ్ అడుగుతుంటే — ''తప్పక చేరుకోగలం సార్ !'' అన్న జవాబిస్తాడు ధన్ ! ఎందుకంటే డాక్టర్ రావ్‌గారి శాస్త్రీయ దృక్పథంలో అవదు, జరగదు, చెయ్యలేము అన్న విధ్వంసక పదాలు లేవని షోఫర్‌ధన్‌కి అనుభవం వల్ల తెలుసు.

''ధన్ చేరుకోగలమంటే చేరుకోగలమే !'' అనుకొని తేలిగ్గా ఓసారి ఊపిరి పీల్చుకొని సీటుకి చేరబడ్డాడు, లండన్‌కి అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనా సభలకి భారతదేశపు ప్రతినిధిగా వెళ్ళినప్పుడు డయర్ కంపెనీలో కొనుక్కున్న వందపౌన్ల సూట్‌ని ఓసారి తడుముకుని —

''ఈ సిట్రాన్‌తో రద్దీ వీధుల్లో కూడా రాంబాణంలా కొట్టుకపోవొచ్చు సార్! సానా మంచి కారొట్టుకొచ్చేరు !'' ధన్ మెచ్చుకున్నాడెన్నోసార్లు. ''అణుశక్తిని శాంతియుత వినియోగం'' అన్న అంశంమీద జరిగిన సభలకి క్రిందటేడు జపాన్ వెళ్ళినప్పుడు, జపాన్ ప్రభుత్వం తన ప్రజ్ఞని మెచ్చుకొని బహూకరించిన కారిది ! ఐతే, ఈ కారొచ్చిందని కాడిలాక్‌ని అమ్మేయలేదు ! ఆవిడ ఒప్పుకోదు ! నగరంలో సినిమాలకీ, షాపింగ్‌కీ, పార్టీలకీ, ఫంక్షన్లకీ క్యాడిలాక్‌లో వెళ్తే దర్జాకాని, సిట్రాన్‌లో వెళ్తే రాజకుమార్తె గుర్రమెక్కి ఊరేగినట్టుంటుంది— ''ఏనుగుమీదెళ్ళవల్సిన జాగాలకి ఏనుగుమీదే వెళ్ళాలి. గుర్రంమీదెళ్ళవల్సిన చోట్లకి గుర్రంమ్మీద వెళ్ళాలి!'' అంటుందామె. ఇంకపోతే అమ్మాయేమో స్పోర్ట్స్ కారు కావాలంటోంది ! ''టెన్నిస్ ఆడుకుందుకెళ్ళడానికి నాకు థండర్ బర్డ్ స్పోర్ట్స్‌కార్ కావాల్సిందే!'' అంటూ ఏడుస్తూ తిండి మానేసింది ఓ రోజున ! వెర్రిపిల్ల! ''అలాగేలే బ్యాత్రిస్! వచ్చేనెల స్టేట్స్ వెళ్తాంగా ? రీగన్ అంకుల్ని అడుగు ! తప్పకుండా ఇస్తాడు!'' అంటూ ఓదార్చాడు. లేకలేక కలిగిన ఒకేఒక్క కానుపు— బాల త్రిపుర సుందరి అని పేరుపెడితే ''ఛీ! ఏంపేరది!'' అంటూ ''బ్యాత్రిసు'' కింద మార్చేసుకుంది జ్ఞానమొచ్చేక.

మరింక తమకి పిల్లలు కలుగరు— మొదటి కాన్పుకే సిసేరియన్ ఆపరేషన్ జరిగినప్పుడూ, ప్రతికాన్పుకి సిసేరియన్ తప్పదని తెలిసినప్పుడూ, ''నాకు మరి పిల్లలొద్దు బాబోయ్! ఓవరీలు తీసేయండి !'' అంది శ్రీమతి— ఆపరేషన్ అంటే చచ్చేభయం ఆమెకు !

తనకు వంశోద్ధారకుడు లేకపోయేడే, తన సైంటిఫిక్ విజ్ఞానమంతా తనకొడుక్కి నేర్పి ఐన్‌స్టీన్ వంటివాణ్ణి చెయ్యాలన్న తనకోరిక నెరవేరలేదే అన్న అశాంతి డాక్టర్ రావ్ మనసులో ఉండిపోయింది. ఆ సంగతే ఎప్పుడో ఓసారి ఆమెతో అంటే, ''దానికేం? మీకు నచ్చిన మరో క్షేత్రాన్నెంచుకొని బీజాన్ని నాటండి! నాకెటువంటి అభ్యంతరమూ లేదు!'' .అనేసి ఓ నిరభ్యంతర సర్టిఫికేటిచ్చేసినా, బీజాన్ని నాటేక క్షేత్రం తనమానాన తాను పోదుగా ? వదలదు ! క్షేత్రమ్మకి మనసుంటుంది— ప్రేమంటుంది— పెళ్ళంటుంది— ఆస్తీ, ఇల్లూ, వాకిలీ అంటుంది— వీటన్నింటికీ సమయమేదీ తనకి ?

''రొమేన్స్ ఈజ్ ఎ వేస్ట్ ఆఫ్ వేల్యుబుల్ హ్యూమన్ టైమ్!'' అన్నఉవాచ డాక్టర్ రావ్‌ది! ఆడా, మగా కలియికకి రొమేన్స్ అన్న మేలిముసుగెందుకు? ప్రేమ అనే అత్తరు పరిమళం ఎందుకు? ఆకలేస్తే భోజనం లాగే ఇదీనూ! రొమేన్స్‌మీద తగలెట్టే కాలాన్నే విజ్ఞాన పరంగా వాడుంటే, ఈ పాటికి మానవుడు అంతరిక్షంలోని మరో భూమి వంటి గ్రహం మ్మీద కాలుమోపేవాడే! ఇంతకీ ఈ రొమేన్స్ రొమేన్స్ అంటూ మానవ జాతిని పాడు చేస్తున్నది కవులూ రచయితలూనూ! ఆ షేక్స్పియరూ, కీట్సూ, షెల్లీ, కాళిదాసూ, కృష్ణశాస్త్రీ... ఇంకెవరో ఎవరో...! వీళ్ళ పుస్తకాలు పాఠ్యగ్రంథాలలో పెట్టి, పిల్లలచేత వల్లెవేయించి వారి మనసులని విషపూరితం చేస్తున్నారు! ఇదీ డాక్టర్ రావ్ అభిప్రాయం

అందువల్ల ప్రేమ... రొమేన్సు... అన్న స్త్రీపరమైన సరస పదాలకి తన జీవితంలో చోటివ్వలేదాయన! మచ్చుకన్నా కాలేజీ రోజుల్లో ప్రేమలో పడలేదు. ప్రేమించబోయిన అన్నుకెన్నల్ని ఆమడ దూరాన్నుంచేడు!

''ఆ జంజాటంలో నేను పడలేను సుమీ! పోనీ! బేబినే సైంటిస్టుగా మారుస్తాను! మదామ్ క్యూరీ అంతదాన్ని చేస్తాను!'' అన్నాడానాడు!

ఆ ఆశా నిరాశే అయింది!

బ్రాతిన్‌కి అర్థమెటిక్ అంటె ఎలర్జీ! ఆల్జీబ్రా అంటే మూర్ఛ! జామెట్రీ అంటే ఫిట్సు! ఫిజిక్స్ అంటే టెంట్రమ్స్! కెమిస్ట్రీ మాటెత్తితే గజగజా వణుకు!

ఉగ్గుపాలతో, జోలపాటలూ, కలలలోకాలూ అలవాటు చేసింది శ్రీమతి! మల్లెలూ, గులాబులూ, సంపెంగ పూలూ, సన్నజాజుల పరిమళాలూ, రాజకుమారులూ, సిండ్రెల్లా కథలూ, కర్పూరం, చందనం, కీట్సు, క్రిష్ణశాస్త్రీ, ఆటలూ, పాటలూ, స్నేహితులూ కబుర్లూ, డాన్సులూ, డిస్కోలూ, ఆర్ట్‌గ్యాలరీలూ, ఫిల్మ్‌ఫెస్టివల్స్, సంగీతం, సాహిత్యం... ఈ లోకంలో తిరగడం స్వర్గం అనిపిస్తుంది తల్లీ కూతుళ్ళకి! ఎక్కడ గాలిలో రొమేన్సుంటే అక్కడ విహరించటం వారికిష్టం!

ఆ విధంగా తన కూతురు తన సాహచర్యం కన్న తల్లి పరిధిలో ఉండడం ఇష్టపడింది! తాను చెయ్యగలిగిందేమీ లేక పోయింది! జీవి పుట్టగానే స్వతస్సిద్ధంగా కొన్ని నైజ గుణాలేర్పడిపోతాయి — తగిన వాతావరణం దొరగ్గానే వికాశం పొందుతాయా గుణాలు — తగని వాతావరణంలో వాడిపోతాయి — డాక్టర్ రావ్ నిట్టూర్చేడు.

ఇంతలో వాయువేగ మనోవేగాలతో వెళ్తున్న కారుకి సడన్‌బ్రేకు పడింది. చంటివాడు ఏడుపు లంకించుకున్నట్టు కీచుమంది కారు —

ఆరడుగుల ఎత్తూ, తొంభయి కిలోల బరువూ ఉన్న రావ్ ఈ ఊపుకి ముందుకు తూలిపడ్డాడు — బాంబు పేల్చినట్టుగా అరిచేడు, ''వ్హాట్ నాన్సెన్స్! సడన్ బ్రేక్ ఎందుకొట్టేవ్!?'' అసలు బ్రేకు కొట్టకుండా, పాలరాతి గచ్చుమీద గోళీకాయ దొర్లినట్టుగా కారు నడపగలడని థన్ అంటే ఇష్టం డాక్టర్ రావ్‌కి— ఏ మాత్రం కుదుపూ భరించలేడాయన— నిరంతరం ఆలోచించే అతడి మెదడుకి కుదుపు అంతరాయం!

''ముష్టోడు కోరుండి కార్కింద పడ్డాడ్సార్! బ్రేక్ కొట్టకపోతే సచ్చును!''

''చావనివ్వల్సింది! ఈ ముష్టి వెధవల్ని రోడ్డుమీదికెందుకు రానిస్తున్నారు? దె షుడ్ బి షాట్ డెడ్!'' కోపం పట్టలేక అరిచేడు — ఈ దేశంలోని ముష్టి జనమందరినీ దూర్వాసముని భస్మం కమ్మని శపించినట్టు అతడి కళ్లలోంచి కోప జ్వాలలు రేగేయి— ''ఐ కెన్ టాలరేట్ ఎనీ బడీ బట్ నాట్ బెగ్గర్స్!'' అని అతడి మనసు అరిచింది!

''ఇయ్యాళ మహాళయం కద్సార్? మార్వాడీ వోళ్లు సంతర్పణ జేస్తున్నార్సార్! ఎక్కడ జూసినా ముష్టోళ్లే! సచ్చినోళ్ల సొరగం నించి దిగుతారు కదా సార్ ఇయ్యాళ?'' థన్ చెప్పేడు —

''బ్లాక్ మార్కెట్లనీ, బెగ్గర్సనీ సృష్టిస్తున్నదీ వ్యాపారస్తులే! ఎటుపోతోంది దేశం! దీజ్ సూపర్ బాస్టర్డ్స్!'' ఆంగ్లంలో తిట్టేడు డాక్టర్ రావ్ —

కారింకా కదల్లేదు— ఎందుకంటే కారు చుట్టూ ముష్టి మూక మూగేరు — కారు కింద పడ్డ ముష్టివాడు అరుస్తున్నాడు ఏ మాత్రం దెబ్బ తగలకపోయినా!

''ఏం బాబో! తమరికి కార్లయితే ఉండొచ్చు! గాని తమకి దేవుడు కళ్లివ్వలేదా? తమరు గొప్పోళ్లవొచ్చుగాని యిది పబ్లిక్కు రోడ్డు! యీడని తమరెంతో మావూ అంతే! తమది గొప్ప తమరింటికాడ! నేను జస్తే నా పెళ్లాం, పిల్లలేటౌదురు? తమలాటోరు బతికినా సచ్చినా లచ్చే!...'' దెబ్బతిన్న కుక్క కుయ్యో మొర్రో మన్నట్టు, దెబ్బతినకుండానే తిడుతున్నాడు —

''షటప్!'' డాక్టర్ రావ్ అరిచేడు — వీళ్లకి చిన్నా పెద్దా తారతమ్యం లేదు — భయభక్తులసలే లేవు.

''బాబూ! ఆడితో తగువేల తమకి? అక్కునక్కువుగా సచ్చుండును! దేవుడి దయవొల్ల బతికిపోనాడు! ఓ వొందనోటిలా పారిండి! మావందరం తమరి పేర్జెప్పుకొని 'సా' నీళ్లు తాగుతాం!'' అన్నాడు జెండాకొయ్యలా కనిపిస్తున్న ఆ ముష్టిమూక నాయకుడు! మాట్లాడినప్పుడు ముందరి పళ్లు లేవని, నోటినించి వచ్చి మీదపడే ఉమ్మి తుంపర్లు చాటుతున్నాయి — పదివేల సంవత్సరాలు తపస్సు చేసి వాల్మీకంలోంచి బయటపడ్డ మునీశ్వరుడిలా ఉన్నాడు — జుత్తూ, గడ్డం పండిపోయింది — బొమికలమీద చర్మం అంటించినట్టుంది — గోచీ ఉన్నా లేనట్టే!

అప్పుడు థన్ కార్లోంచి కిందకి గెంతి, ఆ కారు కిందపడి చావని వాడి పృష్ట భాగంమీద కాలిబూటుతో ఓ తన్ను తన్నేడు — వాడు పది అడుగులు ముందుకు గెంతి ఆ దెబ్బ తగలకుండా తప్పించుకున్నాడు — ''బికారి యెదవల్లారా! మీరంతా ప్లానేసుకుని ఆడిన్నాటకం నాకు తెలీదేటా? యిదేం కొత్తా? యిది సేటుగాడి కారుగాదు! గోర్మెంటోరి కారు!...'' అంటూ బండబూతులు తిడుతూ తన్నడానికి మీద పడేసరికి ముష్టిమూక చెల్లాచెదురయింది.

థన్ మళ్లా కార్లో కూర్చొని రామబాణంలా కారుని తోలుతూ అన్నాడు, ''యిదే యీళ్ల యాపారం సార్! ఫారిన్ కారెంచుకుని దానికింద బడతారు! బ్రేకులు టక్కున బడతాయని ఆళ్లకి దెల్సు! తరవాత దమాయించి డబ్బులు గుంజుతారు!''

డాక్టర్ రావ్ వెనక్కు చేరబడి... ''విమానం అందుతుందా? ఈ ఫ్లయిట్ తప్పిపోతే రేపటిక్కాని మరోటి లేదు!'' ఆత్రంగా అన్నాడు.

''అందించే పూచీ నాది సార్!'' అన్నాడు థన్, ఏక్సిలరేటర్ నొక్కి.

''ఐ హేట్ ది బెగ్గర్స్!'' అనుకున్నాడు డాక్టర్ రావ్ — విదేశాలలో మచ్చుకొక్కడన్నా అగపడ్డే! మన పురాణేతిహాసాలు దానం, ధర్మం అంటూ ముష్టిమూకని తయారుజేసేయి — ఈ దేశం బాగుపడాలంటే కనిపించిన ముష్టివెధవల్నందర్నీ కట్టకట్టి కాన్సెంట్రేషన్ క్యాంప్‌లో పడేసి వాళ్లచేత సల్ఫర్ గనుల వంటిచోట పని చేయించాలి! ఓసారి ముష్టెత్తడం మరిగినవాడు మరేం చెయ్యడు — ఆఖరికి దొంగకూడా కాలేడు.

ఈసారి రష్యా ప్రధాని వెళ్లినప్పుడు, వాళ్ల సైబీరియాలో వీళ్ళను తీసుకెళ్లి పడేడానికి చోటిమ్మని బ్రెజ్‌నేవ్‌ని అడగమని చెప్పాలి.

''ఓవర్ ఎడ్యుకేషను, అండర్ ఎంప్లాయ్‌మెంటూ ఈ దేశాన్ని పట్టుకున్న పీడలు! ఏడో క్లాస్‌తో చదువాపేసి, నూటికి ఎనభైమందిని వారికి సరిపోయే వృత్తివిద్యలు నేర్పి, ఎవరికాళ్లమీద వాళ్లని నిలబడగలిగేలా చెయ్యాలి! ఎందుకీ వేలకొద్దీ కాలేజీలూ, వందలకొద్దీ యూనివర్సిటీలూనూ? మరింత నిరుద్యోగ సమస్యని దేశానికి తెచ్చిపెట్టడం తప్పిస్తే! డిగ్రీలున్న వాళ్లకదా ఉద్యోగం ఇస్తావ చస్తావా అని ప్రభుత్వం నెత్తిమీద కూచుంటోన్న వాళ్లు? మనకున్న ఇంజనీర్లు, డాక్టర్లు, ఆర్ట్స్ సైన్స్ పి.జీలూ...వీరిలో ఎందరు సరుకున్నవాళ్లు? లక్ష కొకడు! తక్కిన మూకంతా ఉత్తి ఊక!'' అని డాక్టర్‌గారోసారి కూతురు ముందంటే ఆమె ఎగతాళిగా నవ్వింది!

''డాడీ! వాడూయూ టాక్! ఎంత చదువుంటే అంత కల్చర్! అందరూ ఎద్దుల్లా అయిపోవాలంటావ్! కాని మన చదువుకున్న యువతరం ఏమీ తక్కువ తినలేదు! వాళ్లంతా జెట్స్! రాకెట్స్! అవకాశం ఇయ్యి, అంతరిక్షంలోకి ఎగిరిపోగలరు!'' అంటూ ప్రతిఘటిస్తుంది.

''బేబీ! నువ్వేం చేసేవ్ ఇంత చదువు చదివి?'' అంటే ...

''చదువుకోబట్టే కదా కీట్సునీ, షెల్లీనీ చదివి అర్థం చేసుకొని, ఆనందించగలుగుతున్నాను? చదువుకోబట్టే కదా కల్చర్డ్ సొసైటీలో తిరగ్గలుతున్నాను? నన్ను పొలాల్లో కూలిమనిషిగా ఇమేజిన్ చెయ్యగలవా డాడీ?'' అంటూ తిరిగి ప్రశ్నించింది.

''అదే నయం! వాళ్లు ఆనందంగా లేరనీ, వారిలో సౌందర్యోపాసనా జ్ఞానం లేదనీ ఎలా అనుకుంటున్నావ్ బేబీ? మనదేశానికి కావల్సింది సూపర్‌స్టిషన్సూ, లేజీనెస్సూ పోవడం! రోజుకి కనీసం ఎనిమిదిగంటలు పని చెయ్యగలగడం!''

''పని చూపు! చేస్తారు!''

''పనికేం? ఎక్కడ పడితే అక్కడే ఉంది — మనకి లేనిదల్లా ఇనీషియేటివ్, డ్రయివ్, కమిట్‌మెంట్ ఎండ్ డెడికేషన్!'' అని డాక్టర్ రావ్ అంటే, నవ్వేసి భుజాలెగరేసింది బ్రాతిన్!

''వచ్చేసేం సార్!'' అన్నాడు థన్స్ ఎయిర్‌పోర్ట్‌లోకి కారుని పోనిచ్చి.

విమానాశ్రయం వచ్చీ పోయే జనంతో రద్దీగా ఉంది. ప్రయాణికుల కన్న విజిటర్సే ఎక్కువ. ఒక ప్రయాణీకుడు వచ్చినా, వెళ్లినా, అతడ్ని రిసీవ్ చేసుకుందుకీ, వీడ్కోలివ్వడానికి బంధుమిత్ర సపరివారం తయారు!

ఇక్కడి వ్యక్తుల ప్రవర్తనే వేరు! ఎరువు తెచ్చుకున్న విదేశీ సంస్కృతి, భారతీయులమని చెప్పుకుందుకి చిన్నతనం, విదేశీ భాషని విదేశీ యాసతో మాట్లాడాలన్న తపన, ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలూ, కార్లూ, బంగళాలూ ఉండగా

రేపటి తిండి గురించి నిశ్చింత; ధనదాహం, అధికార దాహం, హోదా దాహం, తమ అంతస్థు చాటకుండా మన్న తహతహ; తమ సంతతిని తమకన్నా పెద్ద అంతస్థుకి ఎలా పంపడమా అన్న చింత; వీటన్నింటితో సతమతమయ్యే మనుషులతో కిక్కిరిసిన చోటు విమానాశ్రయం!

ప్రజల డబ్బుతో ఎగిరే ప్రభుత్వోద్యోగులు, నిర్మాతల సొమ్ముతో ఎగిరే సినీనటులు, నటీమణులు, ఓ గంటకాలం కలిసొస్తే పదిలక్షల లాభం చేసుకో గలిగే వ్యాపారస్థులూ, తండ్రులార్జించిన నల్లడబ్బుని తమ శృంగార యాత్రలకి తెల్లగా ఖర్చుపెట్టే యువతీ యువకుల జంటలు మసిలే స్థలమది!

మురికీ, దుర్గంధం, ఈగలు, దోమలు ఇరుకు గదులు, జనరల్ రైలు పెట్టెల్లో నిలబడి ప్రయాణాలూ, కర్రలతోనూ, కొయ్యిలతోనూ వంట, మురికి పేటలూ, లేమీ, దరిద్రం వీరికి తెలీవు—

వీరు కట్టుకొనే బట్టలూ, కట్టుకొనే తీరే వేరు— వీరు మాట్లాడే మాటలూ, వాటితీరు తెన్నులూ వేరు— వారు తెలుగే మాట్లాడినా, ఆ పదాల భావం మీకర్థంకాదు— తినబోయే తిండి గురించే వారు ముచ్చటించుకుంటున్నా ఆ తిండిమిటో మీరెప్పుడూ వినిఉండరు— వారి సినీమాలు, వారి హోటల్సు, వారి వినోద స్థలాలూ, వారి నాట్య సంగీతాలూ, వారి సాహిత్యం, వారి అభిమాన నటీ నటులూ అంతా వేరు, వారు భారతీయులా? కారు! అమెరికన్లా? కారు! బ్రిటిషీ? కారు! నీగ్రోలా? ఛీ! పొడు! యురోపియన్లా? అబ్బే కారు! మరెవరువీరు? భారతీయులమనే బురఖా వేసుకున్నా, కొందరు అమెరికన్లూ, కొందరు బ్రిటిషర్లు – కొందరికి ఫ్రాన్స్ అంటే ప్రాణం – కొందరికి ఆఫ్రికాలో సఫారీ అంటే ఇష్టం—"వీరంతా అవకాశం దొరికితే చాలు, నిన్నూ, నీ దేశాన్ని వదిలి పెట్టిపోయే దగాకోర్లు !" అంటూ ఓ ప్రముఖ ఆంగ్లపత్రిక ఆ మధ్యన రాసిన వ్యాసం వీరి కోపానికి గురయింది !

---

శ్రీ సర్దార్ పటేల్ ఆర్ట్ థియేటర్స్ పొద్దుటూరువారి వార్షికోత్సవ సందర్భంగా రాయలసీమ ప్రముఖ జానపద సంగీత కళాకారుడు శ్రీ కె. మునయ్యని సన్మానిస్తున్న మునిసిపల్ ఛైర్మన్ శ్రీ ఐ. సుబ్బారెడ్డి. మధ్యలో ఉన్న సంస్థ అధ్యక్షుడు శ్రీ జి. జయరామిరెడ్డిని కూడా చిత్రంలో చూడవచ్చు.



# తద్దినం

"గుడ్ మార్నింగ్ డాక్టర్ రావ్ !" కోకిల కంఠం !

డాక్టర్ రావ్ ఉలికి పడ్డాడు! ఎదురుగా చూసేడు— ఓ పాతికేళ్ల సుందరి ఎదురుగా వచ్చి స్వాగతం పలికింది— ఆమెతోపాటే మరో ఇద్దరు యువతులు, ముగ్గురు యువకులూ ఉన్నారు—

"ఓహ్ ! సునీతా ! హల్లో సరళా ! హల్లో నీలూ ! హల్లో వినయ్!..." అంటూ పేరు పేరునా పలకరించి, ఇంతమంది తనకి వీడ్కోలివ్వడానికి వచ్చినట్టు గ్రహించి. అహం ఆకాశమంత ఎత్తు ఎగరగా గర్వపడుతూ,... "ఏమిటిది ? మీరంతా వచ్చారెందుకు ?" అన్నాడు డాక్టర్ రావ్, వారు రావడం పట్ల ఏ మాత్రం అయిష్టత కనబరచక—

వీరంతా డాక్టర్ రావ్ గారి స్పేస్ రీసెర్చ్ సెంటర్‌లోని జూనియర్ రీసెర్చ్ సైంటిస్టులు— అందరూ డాక్టరేట్‌లు ఏనాడో పుచ్చుకున్నవారే— కాకా పడితేనే కాని కాలం గడవదనీ, భావి ఉజ్వలంగా ఉండదనీ వారికి తుణ్ణంగా తెలియడంవల్ల, వీరిలో బాగుపడే లక్షణాలుండడం వల్లా, "ఎవర్నో లొకాయి లూకాయి సామంతుల నెందుకూ? ఏకంగా రాజుగార్నే ఆశ్రయించడం వల్ల తక్కిన వాళ్లనంత పట్టించుకో నావసరం లేదు !" అన్న నిర్ణయం తీసుకొని, ఇన్నర్ సర్కిల్‌కి దగ్గరగా ఉంటున్న యువతీ యువకులు వీరు !

సునీతరావ్‌గారి బ్రీఫ్ కేసందుకోగా, "మీకెందుకు శ్రమ !" అంటూ ఆమె చేతి నించది ఒదుపుగా తీసుకున్నాడు వినయ్— నీలూ అతడికి గులాబీపూల బొకే అందించగా, సరళ, "బ్రాతిస్ మూడ్ ఎలా ఉంది సార్ ఇవాళ ?" అంటూ రావు గారి అనుంగు పుత్రిక గురించి అడిగి అతడికి మనోల్లాసం కలిగించింది —

ఒకరు మిసస్ రావ్‌గార్ని పొగడగా, ఒకరు రావ్‌గారి కోటు మీదనించి ఇమాజినరీ క్రిమిని చేతితో తీసి పారేసేరు —

"విమానం డిపార్చర్ టయిమయిందేమో ?" డాక్టర్ రావ్ ఆత్రంగా అడిగేరు —

సరళ కిలకిలా నవ్వింది ... "డిపార్చర్ టైమేనాడో అయిపోయింది సార్ ! మీ కోసమని హమీదాతో చెప్పి ఆపుజేసేం !" అంది ఓరగా చూస్తూ —

"ఎవరీ హమీదా ? పి. ఎమ్.కి కొత్త హెయిర్ డ్రెస్సరా?" అంటూ డాక్టర్ రావ్ అనేసరికి అందరూ ఒక్కసారిగా పగలబడి నవ్వేరు – "అబ్బ మీరు కడుపుబ్బా నవ్వించగలర్సార్ !" అంది సునీత —

"ఐ ఏమ్ నాట్ జోకింగ్ ! విమానం ఆపగల శక్తి మరెవరికుంది ?" అన్నారాయన వారితోపాటు నడుస్తూ – అందుకు మరింత విరగబడి నవ్వేరందరూ —

"హమీదా ఈ ఫ్లయిట్‌కి ఎయిర్‌హోస్టెస్ సార్ –" అంది నీలూ.

"ఓ ! ఆమె కంత పవరుందా ?"

"ఉంది సార్ ! ఈ ఫ్లయిట్ పైలట్‌మీద !" అంటూ ముసి ముసి నవ్వులు నవ్వింది – "హమీదా సరళకి దగ్గరి స్నేహితురాలు !"

"థాంక్స్ సరళా !" అన్నాడు డాక్టర్ రావ్ ఆమె భుజం తట్టి –

ఈ అమ్మాయిలు ఇంత సెక్సీగా బట్టలు కట్టుకొని, తనని కవ్వించి, నవ్వించి సరదాగా కబుర్లాడినా, ఓనాడూ తనలో సెక్స్ ఇన్‌స్టింక్ట్ నిద్ర లేవలేదు ఎందుకో ? దానికి సమాధానమూ అతని మనసుకి తడుతుంది – వీరు నవ్వే నవ్వులూ, కనిపించే ఆప్యాయతా, దగ్గరితనం కేవలం వ్యాపార సరళి ! తను ఈ హోదాలో ఉండకపోతే, లేదా తను ఈ సీటు రేపు కాళీ చేస్తే ఎవరన్నా వీరిలో తనతో మాట్లాడతారా ? మాటాడరు ! అందుకు డాక్టర్ రావ్ కళ్లకి వీరంతా సోఫిస్టికేటెడ్ హ్యూమన్ గేడ్జెట్స్‌లో కనిపిస్తారు తప్ప ఆత్మీయుల్లా కనిపించరు !

"సార్ ! మీరు తిరిగి ఎప్పుడు, ఏ ఫ్లయిట్‌కి తిరిగొస్తారు ?" సునీత అడిగింది ఆయన పక్క పక్కనే పులుముక నడుస్తూ –

"ఏముందీ ? రేపు ఈవినింగ్ ఫ్లయిట్‌లో వచ్చినా ?" అన్నాడు డాక్టర్ రావ్ మామూలు ధోరణిలో... "కాని మీరెవ్వరూ శ్రమ తీసుకొని ఇంత దూరం రాకండి !"

"సో సూన్ సర్ ? వెళ్లక వెళ్లక ఇంటికి వెళ్తున్నారు కదా ? మిసర్స్ రావ్‌గార్నీ, బ్రాతిస్‌నీ కూడా తీసుకెళ్లవల్సింది సార్ !" నీలూ అనునయంగా అంది.

"వాళ్లకా వాతావరణం పడదు ! ఏముందీ వైజాగ్‌లో దిగి, కారులో విజనారం వెళ్లి పని పూర్తిచేసుక వచ్చిడమే... ఓ గంట పని !" డాక్టర్ రావ్ తన బ్రీఫ్‌కేస్ తిరిగి అందుకుంటూ విమానం కేసి నడవడానికి ఉద్యుక్తుడయ్యేడు.

హమీదా ఎదురుగా వచ్చి, "గుడ్ మార్నింగ్ డాక్టర్ ! షెల్ ఉయి గో ? !" అంది నమస్కరిస్తూ, చిరునవ్వుతో.

"సారీ ఫర్ ది ట్రబుల్ హమీదా ! ఎండ్ థాంక్యూ వెరీమచ్ !" డాక్టర్ అన్నాడు ఆమె భుజం తట్టి –

"ఒక్క గంట పనేనా సార్ ?" ఆశ్చర్యపోతూ అడిగింది సునీత.

"చేనులుంటే అరగంటలో అంతా పూర్తి చేస్తాడు !"

"ఎవర్సార్ ఆయన ? సైంటిస్టా ?" అని సరళ అడిగేసరికి డాక్టర్ రావ్ ఫకాల్న నవ్వి...

"ఔను! సైంటిస్టే! స్వర్గంనించి మా నాన్నారి ఆత్మని మంత్రాలతో బంధించి తెస్తాడు !" అన్నాడు ఓ పజిల్‌నిచ్చి సాల్వ్ చెయ్యమన్నట్టు ముఖంపెట్టి–

"అంటే ఏవిటి సార్ ? ఎనీ సూపర్ నేచురల్ ఎక్స్‌పెరిమెంట్ ?" సునీత ఆశ్చర్యపోతూ అడిగింది...

ముందుకు వెళ్తున్న డాక్టర్ రావ్ ఆగి ఒక్క అడుగు వెనక్కువేసి, తల ఎత్తి అంతరిక్షంలోకి చూస్తూ గొణిగేడు... "వెరీ సింపుల్ ! మా తండ్రి తద్దినం !" ఆ మాటలని వారి ముఖాలకేసి చూడకుండా, గబగబా పెద్ద అంగలు వేసుకుంటూ పోయేడు స్పేస్ రీసెర్చ్ సెంటర్ ఛెయిర్మన్ డాక్టర్ రావ్ !

★